అనేక హత్యలు చేసిన హంతకుడి పశ్చాత్తాపం కూడా స్వీకరించబడుతుంది

1760. హజ్రత్ అబూసయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు:- ఇస్రాయీల్ సంతతికి చెందిన ఒక వ్యక్తి తొంభై తొమ్మిది హత్యలు చేశాడు. ఆ తరువాత (దాని నిష్కృతి కోసం) జనాన్ని అడుగుతూ ఒక సాధువు దగ్గరికెళ్ళి "నా పాపానికి నిష్కృతి ఉందా?" అని అడిగాడు. దానికా సాధువు లేదన్నాడు. దాంతో ఆ వ్యక్తి (వళ్ళు మండిపోయి) ఆ సాధువుని కూడా హతమార్చాడు. ఆ తరువాత అతను మళ్ళీ జనాన్ని అడుగుతూ తిరగసాగాడు. ఒకతను కలసి "నీవు ఫలానా ఊరికి వెళ్ళు. అక్కడ కొందరు దైవారాధనలో నిమగ్నులయి ఉన్నారు. వారితో కలసి నీవు కూడా దైవాన్ని ఆరాధించు. దేవుడు నీ పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు" అని చెప్పారు.

(ఈ మాట విని ఆ వ్యక్తి బయలుదేరాడు) అయితే దారిలోనే అతను మృత్యువాతన పడ్డాడు. అతను చనిపోతూ తన రొమ్మును ఆ ఊరి దిశకు మరల్చాడు. అతని (ఆత్మను తీసికెళ్ళే) విషయంలో కారుణ్య దైవదూతలకు, యాతన దైవదూతలకు మధ్య వివాదం చెలరేగింది. అప్పుడు దేవుడు (ఆ వ్యక్తి పాప నిష్కృతి కోసం పోదలచుకున్న) ఊరిని అతనికి దగ్గరగా జరగమని ఆదేశించాడు. అలాగే (అతను బయలుదేరిన) ఊరిని అతనికి దూరంగా జరగమని ఆదేశించాడు. ఆ తరువాత అతని (భౌతిక కాయం) నుండి ఆ రెండు ఊళ్ళు ఎంతెంత దూరం ఉన్నాయో కొలచి చూడమని దైవదూతలను ఆజ్ఞాపించాడు. కొలవడం పూర్తయ్యాక చూస్తే, ఆ వ్యక్తి (మృతదేహం) నిష్కృతికై పోయే ఊరికి ఒక జానెడు దూరం దగ్గరగా ఉన్నట్లు తేలింది. అందువల్ల దేవుడు అతని పాపాలను క్షమించాడు.

(సహీహ్ బుఖారీ:- 60వ ప్రకరణం - అంబియా, 54వ అధ్యాయం - హద్దసనా అబుల్ యమాన్)

Source : **మూలం** : మహా ప్రవక్త మహితోక్తులు (అల్- లూలు వల్ మర్జాన్) **(Al-Lulu-wal-Marjaan) Vol.2**

http://TeluguIslam.net

